# 11 పవిత్ర భారత రహస్యాలు

దైవభక్తి, దేశభక్తి ఈ రెండూ మన జన్మహక్కులు.
మనది పుణ్యభూమి. ఇక్కడ ఎన్ని అద్భుతాలయినా ఇట్టే జరిగిపోతాయ్. అలవాటు పడిపోయాం గనుక మన కవి మామూలుగానే కనిపిస్తాయి గానీ ఇక్కడి గాలీ నీరూకూడా గాంధీ టోపీలా స్వచ్ఛమూ, పరమ పవిత్రాలూ. కనక నే కొద్దిమంది టోపీల్తోనూ, చాలా మంది గాలీ, నీళ్ళతోనూ, సుఖంగా బ్రతక గలుగుతున్నారీ పుణ్యభూమిలో.

ఈ రహస్యం తెలీకనే బుద్ధుడు పాపం ఈ అమాయక ప్రజల్నెందో ఉద్ధరించి పారేద్దామని ఇంట్లోంచి బయల్దేరి పారిపోయాడు బుద్ధుడికి బుద్ధి రావటానికి బోధివృక్షం కావాల్సొచ్చింది. సంవత్సరాలు తరబడి క్షౌరం చేయించుకోకుండా ఈగల్నీ, దోమల్నీ తోలుకుంటూ చెట్టు క్రింద కూర్చోవాల్సొచ్చింది.

కానీ, ఈ మధ్య దేవుళ్ళ మీద దయ్యాలమీద పీకల దాకా నమ్మకంగల ఓ పెద్దమనిషికి అంతశ్రమ పడనవసరం లేకుండానే మంగలి దుకాణంలో గడ్డం గీయించుకుంటూండగా తపీమన జ్ఞానోదయమై అతని ఆఫీసు సమస్యలన్నీ హనుమంతుడు దొరకగానే రాములవారి కష్టా లెగిరిపోయినట్లుగా

పరిష్కారమై పోయాయట సంగతేమంటే మద్రాస్ సెక్రటేరియట్‌లో ఆయనగారో ఎన్జీవో. ఓరోజు ఆఫీసు పనొకటి అర్జంటుగా మరో ఆఫీసుకు పోయి పూర్తి చేసుకురమ్మని ఆఫీసరుగారు ఆర్డరివ్వగా, తక్షణం టాక్సీలో వెళ్ళి క్షణాల్లో ఆ పని పూర్తిచేసి, అర్జంటుగా ఆఫీసుకు తిరిగొచ్చి అర్జంటుగా ఓ టియేబిల్లు రాసి అర్జంటుగా దాన్ని ఆఫీసర్ గారికి సమర్పించుకోగా ఆర్నెల్ల తర్వాత అడిట్ అబ్జక్షన్‌తో సహా అది తిరిగొచ్చిందట.

"నాయనా, నీవో మామూలు ఎన్జీవోగాడివి. ఎంత అర్జంటు పని అయినా ఆఫీసర్లాగ ఆ్రరూపాయలు ప్రజాధనం తగలేసి టాక్సీలో షికార్లు కెళ్ళొచ్చే హక్కు నీకు లేదుగాక లేదు. ఎన్జీవోగాళ్ళు ఎక్కడికయినా జట్కాలో తగలడాల్సిందే గాని టాక్సీలో చచ్చేందుకు రూల్సు ఒప్పుకోవుగాక ఒప్పుకోవు" అని ఆ అబక్షన్ సారాంశం.

అది చూచుకుని అతడు ఆఫీసరుగారి దర్శనం చేసుకుని ఏడుపు ముఖం పెట్టగా! "అవును నాయనా! రూల్సు అనేవి చాలా పవిత్రమయినవి. వెనకటికి రాముల వారి రూల్సుకు విరుద్ధంగా ఎవడో శూద్రుడు తలక్రిందులుగా తపస్సు చేస్తుంటే తక్షణం ఆ నక్కలైట్‌ను సఫాచేసి, ధర్మాన్ని తోక పుచ్చుకు లాక్కొచ్చి కాపాడ లేదా! మనది రామరాజ్యం. ఆ మాత్రం దేశభక్తి రూల్సుభక్తి ఉండొద్దా" అని హితోపదేశం చేశాట్ట.

అందుకని మన ఎన్జీవోగారు ఆ అబ్జక్షన్‌ను ఆమోదించి చేసిన తప్పుకు లెంపలేసుకుని గుంజీలు తీసేరు. మరయితే పెట్టిన ఖర్చును వసూలు చేసుకోవటం ఎలా? ఆ ఊళ్ళో జట్కాలు తిరగటం మానేసి చాలా సంవత్సరాలై పోయిందాయె.

ఇలాంటి సందిగ్ధావస్థలో మన ఎన్జీవో గారికి మంగలి కత్తి చెంపకు తగలగానే అద్భుతమైన అయిడియా వచ్చేసింది.

వెనుక ఇలాంటి సమస్యే వచ్చినపుడు రాముల వారేం చేశారు? ఇండో సిలన్ యుద్ధంలో సుగ్రీవుడి సైనిక సహాయం అర్జంటుగా కావాల్సొచ్చి అందుకోసం రూల్సుకు విరుద్ధంగా వాలిని మర్డర్ చేసేసిన రాములవారు దాన్ని సమర్థించుకునేందుకు వాలి గత జన్మపాపాలను త్రవ్వితీయలేదా!

అలాగే మన ఎన్జీవోగారూ తన పవిత్రావసరార్థం ఏనాడో తిరగటం మానేసిన జట్కాబళ్ళను లాక్కొచ్చేరు. వాటిని తన టియే బిల్లు మీద దౌడు తీయించాడు. రూల్సు ప్రకారం జట్కా ప్రయాణంచేసి ఆఫీసు పని పూర్తిచేసుకు వచ్చినందుకుగాను మైలేజీ లెక్కల ప్రకారం అక్షరాలా పదహారు రూపాయల పన్నెండు పైసలకు బిల్లును మళ్ళీ సబ్‌మిట్ చేశాడా దేశభక్తుడు.

పెద్దలున్నూ అతని ప్రభు భక్తికి సంతసించి వారం రోజుల్లో బిల్లు ప్యాసు చేయటం, ఆ అదనపు రూపాయల్తో ఆ

ఎన్జీవోగారు సకుటుంబంగా సంపూర్ణ రామాయణం సినిమా చూసి తరించటం అన్నీ సక్రమంగా జరిగిపోయాయి.

ఓ గవర్నమెంటు డిపార్టుమెంటులో గంటకు నలభై మూడు నిమిషాలేనట. అదేమిటని అసెంబ్లీలో అడిగితే. మంత్రిగారు కపీమని "రూల్స్" అన్నారట. "ఈ రూల్స్ మూలంగా తొంభై వేలు నష్టపోయాను మహాప్రభో!" అని ఆ సభ్యుడు వాపోయాడు. పాపం ఆయన రామాయణం చదివి ఉండరు. భగవద్గీత చూసి ఉండరు. వాళ్ళకు తగ్గట్టే ఈయనా "నా రూపాయికి డెబ్బయ్యయిదు పైసలే" అనుకుంటే తొంభై వేలు లాభం తీసి ఉండురు గదా! ఈ పుణ్యభూమిలో ఏది అసంభవం గనుక.

ఫ్రాన్స్‌లో సెటిలయిపోయిన ఓ భారత రచయిత ఆ మధ్య మాతృభూమి నోసారి దర్శించి, ఇక్కడి గాలీ - నీరూ వగైరాలు సేవించి ధన్యుడనవుదామనే ఆశతో పుష్పక విమానం ఎక్కి బొంబేలో వామపాదం మోపారు ఆయనలా దిగీ దిగగానే మన కస్టమ్స్ దేశభక్తులు స్వాగత మిచ్చి. ఆయన్నీ, ఆయన సామాన్లనీ లంకను గాలించిన హనుమంతుడి తమ్ముళ్ళలా సోదాచేసి, చివరికో షాంపేన్ బుడ్డిని బయటకు లాగారు.

"ఈ పుణ్యభూమిలో మేచ్చుల సీసాలు సేవించాలంటే తమరు ప్రత్యేకంగా పర్మిషన్ తెచ్చుకోవాలి స్వామీ!" అని చెప్పి, రాములవారు ధర్మాన్ని దాచినట్లు ఆ షాంపీన్

సీసాను గాడ్రేజ్ బీరువాలో దాచి ఆయనగారికో రశీదిచ్చి పొమ్మన్నారు.

ఈయనగారు చేసేదిలేక రామనామ జపం చేస్తూ ఓ టాక్సీ మాట్లాడుకుని కస్టమ్స్ వాళ్ళిచ్చిన అడ్రసుకు పోయి చూస్తే అక్కడసలు ఏ ఆఫీసూ లేదట. వాకబు చేయగా అర్నెల్ల క్రితమే ఆ ఆఫీసు మరో చోటికి మారిందని తెలిసి మళ్ళా టాక్సీ ఎక్కి అక్కడకు చేరాడట...

అక్కడ మూడంతస్తుల మెట్లూ ఎక్కి, ముప్పై మూడు సెక్షన్లూ గాలించి చివరకు పర్మిట్ల సెక్షన్ చేరుకుని తన గోడు చెప్పుకోగా అక్కడి ఆఫీసరుడు అప్పుడే నిద్ర లేచిన కుంభకర్ణుడిలా ఓ నవ్వు నవ్వి రాములవారికి ప్రేమ పాఠాలు నేర్పబోయిన తాటకిలా ఫోజు పెట్టి, "అయ్యా, ఇది యిండియన్లకు మాత్రమే పర్మిట్టిచ్చే పవిత్ర డిపార్టు మెంటు. మీ వంటి విదేశీయులకు పర్మిట్లిచ్చే మ్లేచ్ఛ డిపార్టు మెంట్ ఈ బాంబే నగరంలోనే ఆ మూల అంధేరీలో అయిదో అంతస్తులో ఉంది దయ చేయండి" అన్నాడు.

"ఔరా!" అనుకుని ఆ రచయితగారు భగవద్గీతనోసారి నెమరు వేసుకుని అంతదూరం పోయి ఎలాగోలా సాయంత్రం లోగా పర్మిట్ సంపాదించుకున్నాడు. అది పుచ్చుకుని ఏర్ పోర్టుకు పోతే. "అయ్యా, మా సెక్షన్‌కు పవ్వళించు వేళ దాటె! కనుక మీ షాంపీన్ మీ బుడ్డీ స్టాక్ రూంకు ఏతెంచె!

తమరీ రాత్రికి సుఖంగా పవ్వళించి రేపు తెల్లవారే రేడియోలో వెంకటేశ్వర సుప్రభాతం విని లేచి కాలకృత్యములు నెరవేర్చి వచ్చి స్టాక్ రూం నుండి మీ సీసా తెచ్చుకొందురు గాక!" అని పంపివేశారట. 'సరే'నని ఆయనగారు మర్నాడుదయమే సుప్రభాతం విని ధన్యుడై లెంపలు వేసుకుని స్టాక్ రూంకు మళ్ళీ టాక్సీ ఎక్కి వెళ్ళి, తన సీసాను కస్టమ్స్ దేశభక్తుల చెరనుండి విడిపించి చూడగా ఆ సీసాసగం ఖాళీగా ఉందట. అందుకుగాను ఏడుపుమొహం పెట్టిన ఈయనగార్ని చూసి అక్కడి స్టాక్ రూం కాపలాదార్లు హనుమంతుణ్ణి చూసిన అశోకవనపు రాక్షసుల్లాగాక కాస్తమర్యాదగానే ఇకిలించారట.

దాంతో ఈ రచయితగారికి భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు సెలవిచ్చిన అమూల్య పాఠాలన్నీ ఇట్టే అర్థం అయిపోయాయట...

అదీ సంగతి! మన పవిత్ర భారత రూల్సు వగైరాల్ని గురించీ ఎవరూ ఎవరికీ చెప్పనక్కర్లేదు.... ఆర్నెల్లు అక్కర్లేదు. ఆరు గంటల పాటిక్కడి గాలీ-నీరూ సేవించినా అదే అర్థమయిపోతుంది. అందుకే గాబోలు ఫారిన్ పోయి నాలుగు నెలలక్కడున్న వాళ్ళకి ఈ పుణ్యభూమికి తిరిగి రావాలంటే అంత బెదురు.

అవును మరి! రాముడు అగ్నిప్రవేశం చెయ్యమంటాడని ముందే తెలిస్తే సీత లంకనుండి ఈ పుణ్యభూమికి తిరిగి వచ్చేందుకు ఇష్టపడడేనా? అని నా అనుమానం ?

(ఆగస్టు, 1972)